క్లుప్తంగా

తెగిన విద్యుత్ తీగలు



వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామ సమీపంలో బుధవారం 22/11 కేవీ విద్యుత్ లైన్ తీగలు తెగి పడ్డాయి. ఉరుములు, మెరుపులతో వచ్చిన వానకు ప్రధాన లైన్ తీగలు తెగి పడడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది అక్కడికి వెళ్లి మరమ్మతు చేశారు. తెగిన వైర్ల స్థానంలో కొత్త వైర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు

అకాల వర్షం

టేకుమట్ల: వానాకాలం సీజన్‌లో వేసిన వరి పంటలు ఇప్పుడిప్పుడే కోతకు వస్తున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగు వంతెనపై రైతులు ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. కాగా బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ధర ఎలా వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాటారం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఉదయం, సాయంత్రం సుమారు నాలుగు గంటల పాటు వర్షం కురవడంతో వరి, పత్తి చేలలోకి నీరు చేరింది. అకస్మాత్తుగా కురిసిన వర్షం వరి, పత్తిరైతులకు తీరని నష్టం చేకూర్చింది. పంట పొలాలు కోతకు రావడంతో వర్షం కారణంగా పంట పొలాలు కొంత మేర దెబ్బతిన్నాయి. ఆరుగాలం శ్రమించి పంట చేతికి వచ్చే సమయానికి వర్షం నిండా ముంచిందని రైతులు వాపోతున్నారు.

మరోసారి అవకాశం కల్పించాలి

భూపాలపల్లి అర్బన్: ఎమ్మెల్సీగా తనకు మరోసారి అవకాశం కల్పించాలి యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. వరంగల్–నల్గొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నర్సిరెడ్డి బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లి(ఎస్‌ఎం), పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించి ఉపాధ్యాయ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతి, రమేష్, రంజిత్, సమ్మరావుచ, రమ, రాజేందర్, రామయ్య, కన్నయ్యలు పాల్గొన్నారు.

పరామర్శ

కాళేశ్వరం: మహదేవపూర్, బొమ్మాపూర్, అంబట్‌పల్లి గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ బుధవారం పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, అన్కారి ప్రకాశ్, సల్మాన్ తదితరులు ఉన్నారు.

కోడిపందేలా స్థావరంపై పోలీసుల దాడి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం రాపల్లికోట గ్రామశివారులో కోడి పందేలా స్థావరంపై ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులో కోడిపందేరాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కాగా, నలుగురు వ్యక్తులు పారిపోతుండగా పట్టుకొని వారి వద్ద రూ.2,510 నగదు, రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరూ గ్రామాలు, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణ చేయవచ్చని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ



మంగపేట: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ భద్రు



గోవిందరావుపేట: మాట్లాడుతున్న తహసీల్దార్ సృజన్ కుమార్

మంగపేట: మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమంపై ఎన్యుమరేటర్ల శిక్షణ కార్యక్రమం మండల స్పెషలాఫీసర్ తుల రవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సర్వే వివరాలను ఎలా పొందుపర్చాలి, నిర్వహణలో పాటించాల్సిన మెలుకువలపై ఎంపీడీఓ భద్రు అవగాహన కల్పించారు. సాయంత్రం ఇదే కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఎంపీఓ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, సమగ్ర ఇంటింటి కుటుంబ కులగణన సర్వేపై శిక్షణ తరగతులను మండల కేంద్రంలో నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎన్యూమనేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి మహమ్మద్ ప్రారంభించారు. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని అన్నారు. ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీఓ హనుమంతరావు, ఎంఈఓ సత్యనారాయణ ఉన్నారు.

గోవిందరావుపేట: సమగ్ర ఇంటింటి కుల సర్వే ఫార్మట్‌పై మండల స్థాయి ఎన్యుమరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని రైతుల వేదికలో తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీఓ జవహార్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, మండల సమాఖ్య సీసీలు, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొనాలని అన్నారు. కుల సర్వేలో ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి తేజోలత, ఎంఈఓ దివాకర్, ఎంపీఓ ఇన్‌చార్జ్ శరత్‌బాబు, సాయిదుర్గ, లక్ష్మి పాల్గొన్నారు.



వాజేడు: శిక్షణ ఇస్తున్న అధికారులు

వాజేడు: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేపై ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు పలు విషయాలను వివరించారు. ఇంటింటి సర్వేలో భాగంగా సమగ్రమైన వివరాలను సేకరించాలని సూచించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమగ్రంగా ఉండాలని అన్ని విషయాలను సేకరించాలని తెలిపారు.



వెంకటాపురం(కె)లో..

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసిన వారికి బిస్కెట్ ప్యాకెట్లు అందజేస్తున్న కమాండెంట్ అలెక్స్

గోవిందరావుపేట: రక్తదానం ప్రాణదానంతో సమానం అని బెటాలియన్ కమాండెంట్ అలెక్స్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చల్వాయి పరిధి ఐదవ బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని కమాండెంట్ అలెక్స్ ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 50 మంది పోలీసులు రక్తదానం చేశారని అన్నారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన ములుగు ఏరియా ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు కార్తీక్, సాల్మన్, శ్రీనివాసులు, అన్నయ్య, రాంప్రసాద్, బెటాలియన్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న శంకరయ్య

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కేంద్రంలోని ఎమ్మార్సీలో మండల విద్యాధికారి డి.శంకరయ్య వివిధ పాఠశాలలకు రెండో విడత ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారి మాట్లాడుతూ.. విద్యా సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలను తయారు చేయబడినట్ల తెలిపారు. పిల్లల్లో చదవడం, రాయడం అవగాహన చేసుకోవడం లాంటి నైపుణ్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపొందించాలని కోరారు. అలాగే పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ నేత మాట్లాడుతూ.. విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యా సంవత్సరానికి ముందుగానే పాఠశాలలకు అందే విధంగా చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయురాళ్లు కల్యాణి, సరావత్ సుల్తానా, ఉపాధ్యాయులు సారంగపాణి, శరత్, రాజుకుమార్, సాంబయ్య, మండల వనరుల కేంద్రము సిబ్బంది స్వాతి, మహేష్, రాజు, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాలభివృద్ధికి కృషి

గోవిందరావుపేట: 5వ షెడ్యూల్డ్ భూ భాగంలో 29 ప్రభుత్వ శాఖలు ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్తపురంలో పెసా గ్రామ సభ నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెసా గ్రామ సభలకు కేంద్ర ప్రభుత్వం విశేషమైన అధికారాలు కల్పిస్తుందని అన్నారు. అటవీ, రెవెన్యూ విషయాల్లో పెసా గ్రామ సభలకు పూర్తి అధికారులు ఉన్నాయని అన్నారు. గిరిజన గ్రామాల్లో వ్యవసాయ అభివృద్ధికి గిరి వికాస్ పథకంలో భాగంగా బోర్లు, చెక్ డ్యాంలను నిర్మించాలని తెలిపారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ సర్వే నిర్వహించి పట్టాలు ఇవ్వాలి, గ్రామంలో సీసీ రోడ్లు, రెవెన్యూ, అటవీ శాఖ హద్దులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షాజియా, వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి, కుమారస్వామి, కుంజ శ్రీను, నాగేంద్రబాబు, రమేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్

అటవీ రక్షణలో అలుపెరుగని సేవలు



మాట్లాడుతున్న డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్

మంగపేట: మంగపేట అటవీశాఖ రేంజ్ అధికారి మహ్మద్ షఖీల్‌పాషా అటవీ రక్షణలో అలుపెరుగని సేవలు అందించారని డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ అన్నారు. అటవీ క్షేత్రాధికారిగా తొమ్మిది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న షఖీల్‌పాషా బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మంగపేట రేంజ్ కార్యాలయ ఆవరణలో రేంజ్ పరిధిలోని డీఆర్‌ఓలు, ఎఫ్‌ఎస్‌ఓలు, బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అటవీశాఖ అధికారులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆయనను పూలమాలతో సత్కరించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అటవీ రక్షణ కోసం పాటు ఆయన చేసిన కృషిని కొనియాడారు. అనంతరం షఖీల్‌పాషా మాట్లాడుతూ తన 34 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానంలో తనకు అండగా ఉండి విధినిర్వహణలో తనకు సహకరించిన తన ఉన్నతాధికారులకు, కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి మంగపేట మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తాడ్వాయి ఎఫ్‌డీఓ వజ్రారెడ్డి, ఏటూరు నాగారం ఎఫ్‌డీఓ ఎస్.రమేష్, కాళ్వేరం జోన్ ఎఫ్ఆర్ఓ అసోసియేషన్ సభ్యులు కోట సత్తయ్య, ఆసీఫ్ అలీ, డీఆర్ఓ అశోక్, కోటేశ్వర్, అరుణ, ఎఫ్ఎస్ఓ, బీటాఫీసర్లు, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా యూఆర్ఎస్



మాట్లాడుతున్న జోసెఫ్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్ (యూఆర్‌ఎస్) సమస్యలకు నిలయంగా మరిందని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరేళ్ల జోసెఫ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని యూఆర్‌ఎస్ పాఠశాలను బుధవారం సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ.. అద్దె భవనంలో ఉంటున్న యూఆర్‌ఎస్ కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గదులకు తలుపులు, కిటికీలు లేవని మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని వాపోయారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, పవన్, సాకేత్‌రెడ్డి, సర్యాప పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

టేకుమట్ల: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ విజయలక్ష్మి, ఏఎస్సై దాట్ల కుమారస్వామి అన్నారు. మండలంలోని సుబ్బక్కపల్లిలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలను ఎవరైనా కులం పేరుతో దూషిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. కులాల పేరుతో ఎవరిని చులకన భావంతో ప్రవర్తించరాదని, సమాజంలో మానవులందరూ సమానమే అని తెలిపారు. కులమతాలకతీతంగా కలిసి మెలసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్‌కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

చిట్యాల: రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎవరూ భంగం కలిగించొద్దని తహసీల్దార్ నల్లబెల్లి హేమ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపేట దళిత కాలనీలో హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దళితులపై దాడులు చేసినా, కులం పేరుతో దూషించినా చర్యలు ఉంటాయని అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరాభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు, గ్రామస్తులు ఉన్నారు.



టేకుమట్ల: అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బెగుళూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాల సంబంధించిన చట్టాలు, రక్షణ, హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ కృష్ణ, ఎంపీఓ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా జీవించాలి

మొగుళ్లపల్లి: కులాలకు, మతాలకు అతీతంగా ప్రజలు జీవించాలని తహసీల్దార్ సునీత సూచించారు. బుధవారం మండలంలోని పర్లపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని కులాల పేరుతో ఎవరిని కించపర్చకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సునీత, ఎంపీడీఓ మహబూబ్‌హుస్సేన్, ఎఎస్సై రత్నం, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి బాలుడి అప్పగింత



తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో గుర్తు తెలియని బాలుడు తిరుగుతుండగా అనుమానం వచ్చి మంగళపల్లి శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కాగా, పోలీసులు బాలుడిని వివరాలు అడగగా పేరు మాటూరి అక్షిత్ కుమార్ తండ్రి విజయ్(చనిపోయాడు) తన వయస్సు 11 సంవత్సరాలు గ్రామం కొలనూరు, మండలం ఓదెల, జిల్లా పెద్దపెల్లి అని తెలిపాడు. అలాగే జమ్మికుంట మండలంలోని విద్యోదయ హైస్కూల్ లో చదువుకుంటున్నానని హాస్టల్ నుంచి తప్పించుకోని వచ్చానని తెలిపాడు. దీంతో ఎఎస్ఐ రత్నం బాలుడి తల్లికి సమాచారం అందించడంతో ఆమె వచ్చి తీసుకెళ్లింది.

ఓటు హక్కు లేకపోవడం అన్యాయం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏటూరునాగారం: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులకు మాత్రమే ఓటు హక్కు ఉండటం, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఓటు హక్కు లేకపోవడం అన్యాయమని స్టేట్ టీచర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రాంబాబు అన్నారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. చట్టసభల్లో ఉపాధ్యాయుల గలాన్ని వినిపించే ఉపాధ్యాయుల ప్రతినిధి అయిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీని ఎన్నుకునే ఎన్నికల ప్రక్రియలో ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు లేకుండా చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు మంచర్ల టీవీ వీరభద్రం, అసోసియేట్ అధ్యక్షుడు అడప రాజేందర్, జిల్లా నాయకులు పోతు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ జంతులను వేటాడితే చర్యలు



విద్యుత్ లైన్ కోసం చెట్టుకు ఏర్పాటు చేసిన కర్ర

వాజేడు: విద్యుత్ తెగెలను అమర్చి అటవీ జంతువులను వేటాడితే చట్ట పరంగా చర్యలను తీసుకుంటామని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు హెచ్చరించారు. మండల పరిధిలోని ప్రగళ్లపల్లి, బొమ్మనపల్లి గ్రామాల మధ్యన ఉన్న అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అడవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగెల మూలంగా విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ సిబ్బంది లైన్ వెంట వెళ్లగా విద్యుత్ తీగెలు ఏర్పాటు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ మేరకు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అడవి జంతువులను వేటాడటం, విద్యుత్ వైర్లను అమర్చడం నేరమని పోలీసులు తెలిపారు. గతంలో విద్యుత్ తీగెల బారిన పడి ప్రజల, పశువుల ప్రాణాలను పోయాయని పేర్కొన్నారు.

పాఠశాలలో దీపావళి సంబురాలు



దీపావళి వేడుకల్లో విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండలకేంద్రంలోని తాళ్లపాడులో గల వేదవ్యాస పాఠశాలలో బుధవారం దీపావళి సంబురాలను నిర్వహించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు పండుగ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు హ్యాపీ దివాళీ అని రంగవల్లి వేసి దీపాలతో అలంకరించారు. పాఠశాల యాజమాన్యం సూర్యప్రకాశ్ రెడ్డి, పసునూటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో విద్యార్థులు

గోవిందరావుపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రధానోపాధ్యాయుడు సంతోష్ అన్నారు. మండల కేంద్రంలోని వందన స్కూల్‌లో బుధవారం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. దీపావళీ టపాసులు కాల్చడంతో వచ్చే పొగ, ధూళితో వాయు కాలుష్యం అవుతుందని విద్యార్థులకు తెలిపారు. అలా వచ్చే పొగని ప్రజలు పీల్చడం వలన అనారోగ్యాల బారిన పడుతారని అన్నారు. వాయు కాలుష్య నివారణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాల్లో జాగ్రత్త పాటించాలి



షాపును తనిఖీ చేస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: దీపావళీ పండుగ సందర్భంగా టపాసులు విక్రయించే దుకాణాదారులు తగు జాగ్రత్తలు పాటించాలని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పలు బాణాసంచా విక్రయ దుకాణాలను ఎస్సై సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టపాసుల విక్రయించే వ్యాపారులు తప్పని సరిగా లైసెన్స్ పొంది ఉండాలన్నారు. పోలీస్ శాఖ, అగ్ని మాపక శాఖ నిబంధనలను తప్పకుండా పాటించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని అన్నారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి: పేదల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపనున్న రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ఆపడంలో విజయం సాధించిన సందర్భంగా పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలో సంబురాలు చేసుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలను ఇబ్బందులకు గురి చేసేందుకే ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండగా ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని, ప్రస్తుత ప్రభుత్వం పది నెలల్లోనే పేదలపై భారం మోపేందుకు ప్రయత్నించిందన్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ప్రధాన ప్రతిపక్షం వాదనలోని సహేతుకను విని విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్సీ తిరస్కరించడం మొదటిసారి అన్నారు. భూపాలపల్లిలో తాను పేదలకు మంజూరు చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లను వేరే వ్యక్తులకు ఇవ్వాలని చూస్తున్నారని, అదే గనుక జరిగితే ఆందోళనలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, వైస్‌చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.